పల్లె ముంగిటకు విలువైన వైద్యం

- అన్ని వసతులతో జగనన్న కాలనీలు
- గ్రామాల్లోనే సచివాలయాలు
- పాలనను మరింత చేరువ చేసిన సంక్షేమ ప్రదాత
- పేదల కోసం సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


అమనాం శిబిరంలో లబ్ధిదారులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: వేలాది రూపాయల విలువైన వైద్యాన్ని పల్లె ముంగిట్లో అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసిన సీఎం జగన్ రానున్న ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. భీమిలి మండలం అమనాం పంచాయతీలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ కలలు కన్న నవ సమాజమే ధ్యేయంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను కలుపుకొని అన్ని వసతులతో సీఎం జగన్ కాలనీలు నిర్మిస్తున్నారన్నారు. గతంలో కాలనీలు ఊరిబయట ఉండేవన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల కోసం వివిధ వర్గాల నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగవలసి వచ్చేదన్నారు. ఇప్పుడు ప్రజలు వివిధ పనుల కోసం మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా గ్రామాల్లోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు సినిమా నటులు, టీడీపీ నాయకులు వచ్చి చెప్పే కల్లబొల్లి కబుర్లు నమ్మవద్దన్నారు.

రూ.కోట్లతో సంక్షేమ పథకాలు

పంచాయతీలో రూ.20 కోట్లు విలువ చేసే 160 మందికి ఇళ్ల పట్టాలు, రూ.10 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.4 కోట్ల అభివృద్ధి పథకాలు అందించామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మందులు పంపిణీ చేసి, వైఎస్సార్ పోషకాహార ప్రదర్శనను ప్రారంభించారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో వైద్యులు ఏబీ మల్లికార్జున రావు, ఎం.ఫణికుమార్, బి.కిరణ్‌కుమార్, సయ్యద్ అజ్మల్ సాహుద్దీన్, దుర్గా కల్యాణి, శోభారాణి, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ దంతులూరి ఉమాదేవి, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చెల్లూరి నగేష్, లచ్చుబుగత జగదీశ్వరరావు, తుపాకుల పైడిరాజు, కాద సూర్యనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కుసులువాడలో..

ఆనందపురం : రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ట్రస్టీగా వ్యవహరిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని కుసులువాడలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నవారు పేదవారైనా ధనవంతులతో సమానమన్నారు. సామాన్యులు అనారోగ్యం పాలైతే వారి సంపాదంతా ఆస్పత్రుల బిల్లులకే చెల్లించవలసిన దుస్థితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారన్నారు. అటువంటి పరిస్థితులను దూరం చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. మన కోసం.. మన భవిష్యత్తు కోసం మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఎంపీడీవో అడపా లవరాజు, సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తోమురోతు లక్ష్మి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, ముకుందపురం సర్పంచ్ కలిమి గంగరాజు, మండల వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు, గంటా జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమనాంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తమాలజిస్ట్

'సురక్ష'తో సంపూర్ణ ఆరోగ్యం

పద్మనాభం: అందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే సీఎం వై.ఎస్.జగన్ మోహన రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాందేవుపురంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాధులకు ఇక్కడే చికిత్స అందిస్తామన్నారు. పెద్ద వ్యాధులకు ఆరోగ్య శ్రీ ద్వారా సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని తెలిపారు. ఆరు నెలలకోసారి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను సన్మానించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బాందేవుపురం సర్పంచ్ వాజిగాని ఆదిలక్ష్మి, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ కె.వెణుగోపాల్, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.మణికుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, సుంకర పైడినాయుడు, సాగి కృష్ణ మూర్తిరాజు, ఈర్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కుసులువాడ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న విద్యార్థులు


అమనాంలో వైద్య సేవలు అందిస్తున్న ఎముకల వైద్య నిపుణుడు సయ్యద్ అజ్మల్


బాందేవుపురంలో వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి


కుసులువాడలో వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పెరటి కోళ్ల పంపిణీ


స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెరటి కోళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం: పౌష్టికాహారాన్ని అందించడానికే స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పెంపకం పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాందేవుపురంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు శుక్రవారం ఆయన పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా ఉన్నవారికి పెరటి కోళ్ల పెంపకం పథకం కింద రూ.4వేలకు కిలో బరువు గల ఎనిమిది పెట్టలు, మూడు పుంజులు అందిస్తున్నట్టు తెలిపారు. వీటి ద్వారా ఉత్పత్తి అయిన గుడ్లలో పౌష్టికాహారం లభిస్తుందన్నారు. రెండున్నర కిలోల బరువు వచ్చేంతవరకు పెంచి అమ్మితే రూ.13 వేలు వస్తుందన్నారు. మండలానికి 50 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ వాజిగాని ఆదిలక్ష్మి, ఇందిరా క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఫ్రైడే డ్రైడే'తో వ్యాధులు దూరం


మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము

కొమ్మాది : ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైడే ఫ్రైడే పాటించాలని భీమిలి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయని, వారానికి ఒకసారి డ్రైడే పాటించడం వలన దోమలు తగ్గి, వ్యాధులు దూరమవుతాయన్నారు. అంతా తమ ఇంటితో పాటు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, సచివాలయ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ దయానంద సిద్ధవటం

కొమ్మాది : వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే యువతరం కేవలం ప్రాంగణ నియామకాలను మాత్రమే నమ్ముకోకుండా స్టార్టప్‌ల ఏర్పాటు, ఉన్నత విద్య, సివిల్ సర్వీసెస్‌లో ప్రవేశించడం వంటి ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారించాలని గీతం వీసీ దయానంద సిద్ధవటం అన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులకు వివిధ అవకాశాలకు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు రూపొందించిన పలు పోర్టళ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు వివిధఅంశాలపై పట్టు సాధించేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలకు


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం : ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మండల విద్యా శాఖ అధికారి ఎం.శివరాణి అన్నారు. శుక్రవారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులు, వారి తల్లితండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఇక్కడి ఉపాధ్యాయినులు చక్కగా పాఠాలు బోధిస్తున్నారని కితాబు ఇచ్చారు. విద్యార్థినులు ఇప్పటి నుంచే భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. ఈ విషయంలో తల్లితండ్రులు ప్రోత్సహించడం ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ కుమారి గంగాకుమారి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

నేడు బుడ్డివలస-అగ్రహారంలో 'గడప గడపకు..'

పద్మనాభం : మండలంలోని బుడ్డివలస-అగ్రహారం పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగుతుందని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయి అదికారులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శేషవస్త్రం, అభిషేక సామగ్రి ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాల అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు:

ఇక్కడి శ్రీవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ పద్మావతీదేవికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

సహజ పంటలతో సంపూర్ణ ఆరోగ్యం


సహజ పంటలకు సంబంధించి చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: ప్రకృతి సిద్ధంగా పండించే సహజ పంటను తింటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి అన్నారు. శుక్రవారం గ్రీన్ క్లైమేట్ టీం సహకారంతో ఇళ్లల్లోని ఖాళీ స్థలాలు, మేడలపైన కూరగాయలు, ఆకుకూరల పెంపకం ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఇంటి వద్దే మంచి పంటలు పండించుకుని తినవచ్చన్నారు. బయటి కూరలు రసాయన ఎరువుల ద్వారా పండించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. మన ఇళ్ల వద్దే వీటిని పెద్దగా ఖర్చు, శ్రమ లేకుండా పెంచుకోవచ్చన్నారు. ఉపాధ్యాయినులు కీర్తి కుసుమ, యశోద, శాంతి, స్రవంతి, వసంత, గ్రీన్‌క్లెమైట్ టీం సభ్యులు రాజేశ్వరి, రవితేజ పాల్గొన్నారు.

ఉన్నతికి అంధత్వం ఆటంకం కాబోదు


మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు

పీఎం పాలెం : సామాజిక అభ్యున్నతికి అంధత్వం ఆటంకం కాబోదని చినగదిలి మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులో గల విశాఖ మోడల్ అంధుల పాఠశాల 43వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ రవీంద్రబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో తమ మేధా సంపత్తితో ఎందరో అంధులు ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. కనుక విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి పలువురికి ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అబ్బురపరిచాయి. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బి. సుధారాణి, కరస్పాండెంట్ రత్నరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాలొన్నారు.

సీఎం జగన్ పాలనలో సమన్యాయం


తర్లువాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రాంతీయ అసమానతలు తొలగి అందరికీ సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తర్లువాడలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దీనివలన రాష్ట్ర ప్రజల కోసం ఖర్చుపెడుతున్న ప్రతి పైసా సద్వినియోగం అవుతోందని చెప్పారు. టీడీపీ పాలనలో ముందస్తు ప్రణాళికలు లేకుండా కేవలం పార్టీ వారికే లబ్ధి చేకూరే విధంగా పథకాలు అమలు చేసి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని.. దీనివలనే గ్రామీణాభివృద్ధి కుంటు పడిందని వివరించారు. వైద్యం, విద్య, వసతి, ఉపాధి వంటి రంగాలలో గణనీయమైన మార్పులు తీసుకు రావడంతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. టీడీపీ పాలనలో ప్రజల స్థితి గతులు, సమస్యలను తెలుసుకోవడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని, పాలకులు, అధికారులు కేవలం కార్యాలయాల్లోనే ఉండి పథకాలు అమలు జరపడంతో నిధులు దుర్వినియోగానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటి తలుపుతట్టి సమస్యలను తెలుసుకోవాలనే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను ఇంటింటికీ పంపిస్తున్నారని వివరించారు. తన వలన మంచి జరిగితేనే ఓట్లు వేయండి అని ధైర్యంగా అడిగే నాయకుడు దేశంలో ఇంకెక్కడా లేరని, అది సీఎం జగన్‌కు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

చంద్రబాబు కాళ్లు మొక్కే నాయకులు అవసరమా?

పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ చంద్రబాబు కాలు మొక్కుతున్నారని, అలాంటి నాయకులు మనకు అవసరమా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. భవిష్యత్తు బాగుండాలన్నా, ఇప్పటి వలే అవినీతి లేని పాలన కావాలన్నా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తర్లువాడ పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.15 కోట్లు వ్యయం చేశామన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో రూపొందించిన కర పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, ఎంపీడీవో అడపా లవరాజు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు మజ్జి రమేష్ నాయుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, పాండ్రింకి అప్పారావు, బొట్టా రామకృష్ణ, చెన్నా సత్యం, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల దసరా ఉత్సవాల సందడి


మద్దిలో బాణాలు పట్టుకుని వీధుల్లో తిరుగుతున్న విద్యార్థులు

పద్మనాభం : మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యార్థులు శుక్రవారం దసరా ఉత్సవాలు నిర్వహించి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచారు. బాణాలు పట్టుకుని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దసరా పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతి ప్రసూన, బాందేవుపురం కో-ఆపరేటివ్ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలపై ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం


శీరపు అప్పలరెడ్డి

తగరపువలస: కుల ధ్రువీకరణ పత్రాలు ఒకసారి తీసుకుంటే ఎప్పుడైనా చెల్లుతాయని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడం అభినందనీయమని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చిట్టివలసలో మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ఏటా కుల ధ్రువీకరణ పత్రాలకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేదన్నారు. ప్రభుత్వం కొత్త నిబంధనలతో 95 శాతం సర్టిఫికెట్ల జారీ తగ్గడం హర్షణీయమన్నారు. దీని వలన విద్యార్థులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు.

- భీమిలికి చెందిన బీసీ సంఘాల నాయకులు చిప్పాడ వెంకటేష్, తెడ్లాపు అప్పలరాజు మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం విద్యాసంస్థలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా ప్రభుత్వం మంచి నిర్ణయం ప్రకటించిందన్నారు.

8వ వార్డులో పడకేసిన పారిశుధ్యం


ఎస్సీ కాలనీలో రోడ్డుపై దర్శనమిస్తున్న వ్యర్థాలు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య నిర్వహణ కుంటుపడింది. సాగర్‌నగర్, సుభాష్‌నగర్, గొల్లల ఎండాడ, ఎండాడ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్ ప్రాంతాల్లో రోడ్లపైన వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నప్పటికీ మలేరియా, శానిటేషన్ సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదు. వారానికి ఒక్కసారైనా చెత్త తొలగించడం, బ్లీచింగ్ చల్లడం వంటివి చేయక స్థానికులు జ్వరాలకు గురవుతున్నారని అంటున్నారు. అంతే కాకుండా సుభాష్‌నగర్, గొల్లల ఎండాడలో శానిటరీ సూపర్‌వైజర్ మూడు నెలల నుండి విధులకు రావడం లేదని, అయినా ఆయనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని.. లేకుంటే ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు తెలిపారు.

ప్రకృతి వనం సందర్శన


మొక్కలను తిలకిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యాన వనాన్ని నగరంలోని ప్రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్ విశేషాలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు. పార్క్‌లోని వైవిధ్యత కలిగిన మొక్కలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎడారి సంరక్షణాలయంలోని కారల్లుమా క్రైనులాటా మొక్క పుష్పాలతో కనువిందు చేస్తోంది. ఎర్రని నక్షత్రం పువ్వులతో ఎంతో ఆకట్టుకుంటోంది.

కోడిగుడ్లతో ఆరోగ్యానికి మేలు


కోడి గుడ్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు


గుడ్డు గురించి అవగాహన కలిగిస్తున్న బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు

భీమునిపట్నం : ప్రతి ఒక్కరూ గుడ్లు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అన్నారు. ప్రపంచ గుడ్ల దినోత్సవాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు నిర్వహించగా అందులో పాల్గొన్నారు. గుడ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాన్ని తెలియజేసేందుకు ప్రతి ఏటా ఈ రోజును గుడ్ల దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. గుడ్లలో పోషక పదార్థాలు మెండుగా ఉంటాయన్నారు. పిల్లలకు గుడ్లు ఇవ్వడం ద్వారా వారు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.త్రినాథరావు, జె.మాధవి, సోమయాజులు పాల్గొన్నారు.


బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో..

తగరపువలస : విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న గుడ్డు సమతుల ఆహారంలో అగ్రస్థానం కలిగి ఉందని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా గుడ్డు గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. మెదడు అభివృద్ధికి గుడ్డు దివ్యంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు

కొమ్మాది : తిరుపతిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5.30 నుండి 7.30 వరకు విద్యార్థులచే సంగీతం, నాట్యం, నాదం, గీతం ఉపచారాలు నిర్వహించనున్నట్లు కార్తీక దీపోత్సవం కమిటీ తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు 8074054887 నంబరులో సంప్రదించవచ్చు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట


గ్రంథాలయ వీధిలో రాట వేస్తున్న దృశ్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతం గ్రంథాలయవీధిలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం రాట వేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.